క్లుప్తంగా

గ్రామసభ వాయిదా

ధన్వాడ: 2024–25సంవత్సారానికి చెందిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ యాక్షన్ ఫ్లాన్‌కోసం గురువారం మండలంలోని గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన గ్రామ సభవాయిద పడింది. సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వార్డుసభ్యులు, అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు మినహా గ్రామస్తులు ఎవరూ పాల్గొనకపోవడంతో గ్రామ సభవాయిద వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. శుక్రవారం తిరిగి గ్రామసభ నిర్వహిస్తామని గ్రామస్తులు అందరు పాల్గొనాలని పంచాయతీ అధికారులు కోరారు.

ప్రభుత్వ భూముల గుర్తింపు

కోస్గి: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల గుర్తింపునకు సిద్ధమయ్యారు. పలు అభివృద్ధి పనుల నిమిత్తం అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని రాష్ట్ర అధికారులు సూచించిన నేపథ్యంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ మల్లేశ్ ఆర్‌ఐ, సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని నాగుసాన్‌పల్లి, సంపల్లి పరిధిలో సర్వేనంబర్ 1101,1265, 1308, 1309లో మొత్తం 14 ఎకరాలు ఉన్నట్లు తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. గుర్తించిన భూముల వివరాలను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.

'ఇథనాల్'తో ఆహార కొరత

మరికల్: ఇథనాల్ పరిశ్రమలు స్థాపించిన గ్రామాల్లో భవిష్యత్‌లో ఏర్పడే కాలుష్యంతో ఆహార కొరత ప్రభావం ఉంటుందని కంపెనీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ మురళీ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. చిత్తనూర్‌తో పాటు దిలావర్పూర్, హిందుపూర్ జిల్లాలో ఏర్పాటుచేస్తున్న ఇథనాల్ కంపెనీలను తరిమి కొట్టేందుకు ఈ నెల 20న హైదరాబాద్‌లో (సెమినార్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బాధిత గ్రామాల ప్రజలు, రైతులు, యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బల్మూర్ వెంకట్‌ను కలిసిన నాయకులు

కోస్గి: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన బల్మూర్ వెంకట్‌ను గురువారం ఎన్‌ఎస్‌యూఐ కోడంగల్ అసెంబ్లీ అధ్యక్షుడు అశోక్‌తోపాటు నాయకులు కలిసి సన్మానించారు. హైదరాబాద్‌లో వెంకట్‌ను కలిసిన నాయకులు పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు హరీశ్వర్‌రెడ్డి, హరి, వినోద్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో ముదిరాజ్‌ల కులదైవం అంబిగర చౌడయ్య విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ గురువారం గ్రామ యువకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి విజ్ఞప్తిచేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వారికి అవసరమయ్యే సహాయ సహకారమందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఇందులో గ్రామ యువకులు రవి, గౌరి, మార్కండేయ, గుడెబల్లూర్ రాము తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



దామరగిద్ద: దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరన్నగౌడ్, నర్సప్ప, రాజప్ప, మొగులప్ప రంగయ్య పాల్గొన్నారు.

నర్వ: దివంగత ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు ప్రపంచంలోని తెలుగువాళ్ల మెచ్చిన యుగపురుషుడని మాజీ సర్పంచ్ డా.వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కుర్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఎల్లారెడ్డి, రాములు, శ్రీనివాసులు, వెంకట్రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో గురువారం పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అయితే ఈ ఆదివారం 'సాక్షి' దినపత్రికలో జోరుగా పేకాట స్పందించని అధికారులు అనే వార్త రావడంతో ఎస్పీ స్పందించి టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని పంపించినట్లు తెలిసింది. దీంతో ఈ దాడులు చేయగా పలువురు పరారయ్యారు. ఇద్దరిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ మల్లేష్ ఇద్దరిపై కేసునమోదుచేసి వారి నుంచి రూ.2090 నగదు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వండి

- మండల సర్వసభ్య సమావేశంలో కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి
- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

మద్దూరు: కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు గ్రామాల వారీగా ప్రతిపాదనలు ఇవ్వాలని ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ అధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. నియోజకవర్గంలో విద్యా, వైద్యం, రవాణ సౌకర్యాలపై ప్రధాన దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రధానమైన సమస్యలను ముందుగా గుర్తించి ప్రతిపాదించాలని సూచించారు. అలాగే అధికారులు పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పన, తదితర అంశాలపై పరిశీలించి సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని సింగిల్‌రోడ్డు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లను డబుల్ రోడ్లు, డబుల్ రోడ్లను మరింత వెడల్పు చేయడానికి దాదాపు రూ.450 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఇటు సంక్షేమం, అభివృద్ధి పనులకోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కొడంగల్‌లోని క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. అనంతరం అధికారులు ప్రగతి నివేదికలను సభ్యులకు చదవి వినిపించారు. అంగన్‌వాడీలకు సంబంధించిన స్థలాల పత్రాలను ఐసీడీఎస్ అధికారులు అందజేస్తే వాటికి కంపౌండ్ వాల్స్ ఇతర మరమ్మతులు చేయించడానికి అవకాశం ఉంటుందని వెంటనే ప్రత్యేకాధికారి వివరాలు అందించాలని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. అధికారులకు డిప్యూటేషన్ వేయకుండా అన్నిశాఖలకు అధికారులను కేటాయించాలని సభ్యులకు సూచించారు. ఐదేళ్లుగా గొర్లోనిబాయిలో అంగన్‌వాడీ కేంద్రం పనిచేయడం లేదని సర్పంచ్ కృష్ణయ్య సభదృష్టికి తీసుకొచ్చారు. ఐదేళ్లుగా ప్రగతి నివేదికల్లో ఏ మార్పు లేకుండా అలాగే అధికారులు తీసుకొస్తున్నారని అల్లీపూర్ సర్పంచ్ రమేష్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. పీఆర్ పనులు గతంలో జరగని కూడా జరిగినట్లు నివేదికలు ఉన్నట్లు ఆయన తెలిపారు. అన్నిశాఖల అధికారుల తీరు ఇలాగే ఉందని మండిపడ్డారు. రేషన్‌బియ్యం పేదలకు అందకుండా డీలర్లు అక్రమాలకు పాల్పడి రైస్ మిల్లులకు అమ్ముతున్నారని, దీనిపై రెవెన్యూ, టాస్క్‌ఫోర్స్ అధికారులు దృష్టిసారించాలని ఆయన సూచించారు. భీంపూర్‌లో పాఠశాల భవనం అసంపూర్తిగా ఉందని దాని వెంటనే పూర్తిచేయాలని ఖాజీపూర్ ఎంపీటీసీ అన్నపూర్ణ సభదృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో 24గంటలకు వైద్యులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకొచ్చారు.

ఎంపీటీసీ వర్సెస్ సర్పంచ్..

మద్దూరు ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం అన్యక్రాంతమవుతుందని, దీనిపై కలెక్టర్, సర్పంచ్, ఎంపీఓ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోయిందని ఎంపీటీసీ వెంకటయ్య ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సభలో ఉన్న మద్దూరు సర్పంచ్ అరుణ స్పందిస్తూ పంచాయతీ ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని సక్రమంగా ఉండడంతో అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు. ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి కలిగించుకొని తమ దగ్గర అధారాలను ఉంటే ఇవ్వాలని దానిపై సమగ్ర విచారణ జరిపిస్తామని సర్ది చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్లు జయరాములు, అనిల్‌కుమార్, ఎంపీఓ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ మోదీ లక్ష్యం



నారాయణపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావునామాజి, శాంతికుమార్, రతంగ్‌పాండురెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సింగారం, శ్యాసన్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేశామని, మహిళలు, బాలికల సంక్షేమమే ధ్యేయంగా పని చేసినట్లు వివరించారు. దేశ రక్షణలో ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించడంతో పాటు సంచలనాత్మకంగా ధైర్యంతో ప్రజల అభీష్టానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. అనంతరం వికసిత భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రఘురామయ్యగౌడ్, రఘువీర్‌యాదవ్, వెంకటయ్య, రాము, శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, గణప శ్రీనివాస్, భీంసేన్‌జ్యోషి, అయ్యప్ప, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

నర్వ: ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలపై గురువారం యాంకిలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ డిస్‌ప్లే ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పోస్టర్లు, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, రైచూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్

మరికల్: గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ గోవర్ధన్ అన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రామ సమస్యల పరిష్కారంకోసం గ్రామసభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కో -ఆప్షన్ సభ్యులు మతిన్, వార్డు సభ్యులు కమల్, రామకృష్ణారెడ్డి, నాగరాజ్, విజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

మరికల్: మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నారా కొండయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గురువారం రాష్ట్ర బీజేపీ నాయకులు శాంతకుమార్, రతంగపాండురెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు స్థానిక చౌరస్తాలో అఖిలపక్షం పార్టీ ఆధ్వర్యంలో ఆయన మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బసంత్, రాజేష్, రవికిరణ్, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, భాస్కర్‌రెడ్డి, వేణు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వరి సాగులో జాగ్రత్తలు అవసరం



వర్కూర్‌లో వరిపంటను పరిశీలిస్తున్న ఏఈఓ ప్రవీణ్

మాగనూర్: వరి సాగులో జాగ్రత్తలు అవసరమని ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరిసాగు చేసిన తర్వాత పంటలు ఎండిపోతున్నాయని అందిన ఫిర్యాదుతో గురువారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఏఈఓల తోపాటు ఆయన వరిపొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. వరినాటు వేసిన 15తర్వాత నారు ఎండిపోయినట్లు కనిపిస్తే ఇది సల్ఫైడ్ ప్రభావంగా చెప్పవచ్చని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే రైతులు పొలంలో ఉన్న నీటిని మొత్తం తొలగించి ఎకరానికి 20కిలోల యూరియ, నాలుగు కిలోల ఫెర్టేరా గులికలు, 30గ్రాముల కార్బొండైజమ్ మందులు కలిపి పొలంలో చల్లుకొని నీటిని పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ వరిపంటపొలాలు, పండ్లతోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరినాటు వేసిన తర్వాత నారు ఎండిపోయినట్లు కనిపిస్తే ఇది సల్ఫైడ్ ప్రభావంగా చెప్పవచ్చని తెలిపారు. అందుకు గాను రైతులు పొలంలోని నీటిని తొలగించి ఎకరాకు 20కిలోల యూరియ, 4కిలోల ఫెర్టెరా గుళికలు 30గ్రాముల ఫెర్నిండిజం కలిపి పొలంలో చల్లుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నేనావత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మక్తల్: మధ్యాహ్నభోజన కార్మికుల వేతనలు విడుదల చేయాలని కోరుతూ.. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు.. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ.. గత 9నెలలుగా కార్మికులకు ప్రభుత్వం నుంచి వేతనాలు అందడం లేదని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సువర్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత



నర్వ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్, కొత్తపల్లి గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో పీడీఎస్ రైస్ పట్టుకున్నట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. పెద్దకడ్మూర్‌లోని నర్సింహ ఇంట్లో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం, కొత్తపల్లి శివారులో ఆంజనేయులుకు చెందిన ఆటోలో 4.5 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్నామన్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మక్తల్: మండలంలోని సంగంబండలో గురువారం కోమటి నవీన్ ఇంట్లో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వఉంచిన వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

ఆలయాలను శుద్ధిచేసిన నాయకులు



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీనాయకులు

నారాయణపేట రూరల్: అయోధ్య శ్రీరామతీర్థ క్షేత్ర ట్రస్ట్ పిలుపుమేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలను బీజేపీ నాయకులు శుద్ధిచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ నెల 22న అయోధ్యలో జరిగే రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఆలయాలను శుభ్రం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్నిగ్రామాల్లోని ఆలయాలను శుభ్రం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రతంగపాండురెడ్డి, శాంతికుమార్, నాగురావునామాజీ, రఘురామయ్యగౌడ్, రఘువీర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

మరికల్: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు రాజేష్, బసంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని ఆధార్ సెంటర్ లేక ధన్వాడ, మక్తల్, నారాయణపేట పట్టణాల్లోని ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడేళ్ల నుంచి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తమ సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆంధార్ కేంద్రాన్ని ఏర్పాటుకు పాలకులు, అధికారులు చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శివ, నాగరాజ్, రవి, కొండయ్య, కమల్, ప్రకాష్, మల్లేష్ పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వాహకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు.

మహిళలను రక్షించడమే షీ టీం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న షీటీం ఇన్‌చార్జి శ్రీదేవి

కోస్గి: మహిళలను వేదింపుల నుంచి రక్షించడమే షీ టీం ప్రధాన లక్ష్యమని షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై శ్రీదేవి సూచించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేద్కర్ ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణకోసం చేపడుతున్న షీటీం, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, సైబర్‌నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. బాలికలు, మహిళల సంరక్షణకోసం ప్రత్యేకంగా నియమించబడ్డ షీటీంలు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్‌లు, విద్యార్థులు రద్దీగా ఉండే ఆటోస్టాండ్‌లతోపాటు ప్రధాన చౌరస్తాల్లో గస్తీ నిర్వహిస్తారన్నారు. సివిల్ డ్రస్‌లో ఉండే షీటీం సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, వేదింపుల్ని భరించకుండా పోలీసులకు 100కుగాని, 8712670398 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. చదువుకునే వయస్సులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడంతో చిన్నారుల జీవితాలు నాశనమవుతున్నాయని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వివరించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు లయక్, బాల్‌రాజ్, సమీనతోపాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక జాగృతి సంచిక విడుదల



జాగృతి సంచికను విడుదల చేస్తున్న తహసీల్దార్

ఊట్కూరు: అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక జాగృతి సంచికను గురువారం తహసీల్దార్ శివశ్రీనివాస్ చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకులు ఎంకోభ మాట్లాడుతూ జాగృతి ప్రత్యేక సంచిక విడుదల చేయడం సంతోషకరమని, ఈ ప్రత్యేక సంచికలను వివిధ కార్యాలయాలు, పాఠశాలలో పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఊట్కూరు: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కోరారు. గురువారం మండలంలోని ఐఎఫ్‌టీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రథమ మహాసభలు ఉన్నాయని కార్మికులందరూ విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ కార్మికులను రెగ్యూలర్‌చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని జీఓ నంబర్50ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోటారు రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి భీమా సౌకర్యం కల్పించాలని కార్మికుల సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాద మరణానికి రూ. 10లక్షల బీమా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు హన్మంతు, రవీందర్, లింగప్ప, బాబు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచ్ దామోదర్‌రెడ్డి

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో ఎంపీ నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు సునిల్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలని కోరుతూ.. ఎంపీకి విన్నవించగా స్పందించి న ఆయన ఎంపీ నిధుల నుంచి రూ.5లక్షలను కేటాయించారని, వీటితో గ్రామంలో ప్రధాన కూడలిలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నట్లు వారు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతిని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మద్దూరు: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధారుడ్యాన్ని అందిస్తాయని జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ తెలిపారు. బుధవారం రాత్రి గ్రామ శివారులోని మైసమ్మ ఉత్సవాల సందర్భంగా ఓపెన్ టూ అల్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు కర్ణాటకా రాష్ట్రంలోని రాయచూర్, గుర్మిట్‌కల్, నారాయణపేట, దామరగిద్ద, దౌల్తాబాద్ మండలాల నుంచి 26టీంలు పాల్గొన్నాయి. హోరాహోరి జరిగిన పోటీలో రాయిచూర్, దౌల్తాబాద్ జట్టు ఫైనల్ తలపడ్డాయి. రాయచూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేత టీంకు ట్రోఫీతో పాటు రూ.10,116, రన్నరప్ టీంకు ట్రోఫీ తోపాటు రూ. 5,116 జెడ్పీటీసీ అందజేశారు. మూ డో బహుమతి గుర్మిట్‌కల్ టీంకు ప్రభాకర్‌రెడ్డి రూ. 2,116 అందజేశారు. మండల నాయకులు వీరేష్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన డబ్బాల తొలగింపు



డబ్బాను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మరికల్: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీని అనుకొని రాత్రికి రాత్రే కొందరు కబ్జాదారులు అక్రమంగా డబ్బాలు, షెడ్లను వేశారు. ఇక్కడే స్వామివివేకానంద విగ్రహం ఏర్పాటుకోసం దిమ్మె నిర్మాణపనులు కొనసాగుతున్న ఈ స్థలంపై కన్నేసిన ఓ వర్గానికి చెందిన వ్యక్తులు బుధవారం రాత్రి డబ్బాలకు సంబంధించిన సబ్‌స్టేషన్ స్థలాన్ని అక్రమించుకున్నారు. అందులో నాలుగు డబ్బాలు, మిగితావి కర్రలతో షెడ్లను వేశారు. గురువారం ఉదయం విగ్రహ దిమ్మెకు నీళ్ల పోయడానికి వెళ్లిన యువకులు ఈ విషయాన్ని సర్పంచ్ గోవర్ధన్, కార్యదర్శి శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించకపోవడంతో అఖిల పక్షం పార్టీల నాయకులు, గ్రామ యువత వెళ్లి ఆందోళనకు దిగడంతో పంచాయతీ సిబ్బందితో వాటిని తొలగించి ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు. ఈ విషయంపై ఏఈ రవికాంత్ మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీ వద్ద ఎవరూ డబ్బాలు, షెడ్లు వేసి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. మరోసారి ఎవరైనా అక్రమంగా డబ్బాలు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజేష్, ఆంజనేయులు, రవికిరణ్, బసంత్, సూర్యమోహన్, హరిష్, కమల్, కృష్ణయ్య, శివ, నాగరాజ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటయ్య

నర్వ: పాఠశాలలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలి మెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులు సాధించిన సామర్థ్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు నమోదు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజనం మెనూప్రకారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం మల్లేష, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కరోనా వ్యాప్తిని అరికడదాం

మాగనూర్: రాష్ట్రంలో కరోనా మహమ్మారి మరోసారి జనాలను వణికించేందుకు సిద్ధమవుతున్నట్టుగా కనిపిస్తోందని మండల వైద్యాధికారి విరోజ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండేళ్లపాటు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి మళ్లీమెల్లగా చాపకింద నీరులా క్రమంగా వ్యాపిస్తోందన్నారు. వైద్యసిబ్బంది నేటినుంచి ప్రతిగ్రామంలో కరోనా వ్యాప్తిపై అవగాహన నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా మాస్క్ ధరించి, భౌతికదూరం పాటించేవిధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నాగరత్న, తేజశ్విని, సంతోషమ్మ, రేణుక, శృతి, రాజేష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.